క్లుప్తంగా

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి



చేనేత హస్తకళలను పరిశీలిస్తున్న జ్యోతి

జగిత్యాల: చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శుక్రవారం శుభమస్తు కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన హస్తకళ హ్యాండ్‌క్రాఫ్ట్‌లను ప్రారంభించారు. చేనేత వస్త్రాలైన పోచంపల్లి బెడ్‌షీట్స్, ఖాదీ వస్త్రాలతో పాటు కొండపల్లి బొమ్మలు, లెదర్ బ్యాగులు కొనుగోలు చేసుకోవాలన్నారు. ఆమె వెంట నిర్వాహకులు ఉన్నారు.

క్రీడలు ఎంతో ముఖ్యం

జగిత్యాల: విద్యార్థులకు విద్యతో పాటు, క్రీడలు ఎంతో ముఖ్యమని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక జ్యోతి హైస్కూల్ విద్యార్థులకు గీత విద్యాలయంలో స్కూల్ ఒలంపిక్స్ పేరిట స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే క్రీడల్లో పాల్గొనాలన్నారు. డైరెక్టర్ హరిచరణ్‌రావు మాట్లాడుతూ ప్రతీ ఏడాది వార్షిక స్పోర్ట్స్ నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మౌనికరావు, అజిత్, రజితరావు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రభుత్వ కళాశాలలోనే చేరాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

సారంగాపూర్: పదో తరగతి విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే ఇంటర్ చదవాలని సారంగాపూర్ కళాశాల అధ్యాపకులు కోరారు. మండలంలోని రేచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులను కలిసి అవగాహన కల్పించారు. జూనియర్ కళాశాలలో అన్ని మౌలిక వసతులతో పాటు, అన్ని సబ్జెక్టులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, గ్రంథాలయం, ల్యాబ్ ,ప్లే గ్రౌండ్ ఉన్నాయని తెలిపారు. కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం బి. మధుసూదన్, అధ్యాపకులు శ్రీధర్, రాజు, రాజేందర్, రాజ్‌కుమార్, రజిత, నాగేశ్వరి పాల్గొన్నారు.

పొలాల్లో అధికంగా జింక్ లోపం



పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సారంగాపూర్: యాసంగి వరిలో జింక్ లోపం అధికంగా కనిపిస్తుందని మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సారంగాపూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పొలాలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జింక్ లోపం ఎక్కువగా ఉందని, దీంతో పాటు స్వల్పంగా మొగిపురుగు ప్రభావం కనిపిస్తుందన్నారు. దీనికి అవసరమైన మందులను రైతులకు సూచించారు. ఆయన వెంట రైతులు, ఏఈవో వెంకటేష్ ఉన్నారు.

లొంక రామేశ్వరస్వామికి నాగభరణం బహూకరణ

కథలాపూర్: మండలంలోని పోతారం లొంక రామేశ్వరస్వామికి ఇప్పపెల్లి గ్రామానికి చెందిన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ శుక్రవారం వెండి నాగభరణం బహూకరించారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్‌ను స్థానిక నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష, మాజీ సర్పంచ్ ధర్మపురి జలందర్, నాయకులు రమేశ్‌యాదవ్,శేఖర్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



మేడిపల్లి: ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన ప్రజాప్రతినిధులకు భీమారం మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితంగా వర్గీకరణ సాధ్యమైందన్నారు.కార్యక్రమంలో బంగారు దీపక్, హరిష్, దాసరి శంకర్, ఎర్రం రాజేశ్, నల్ల నర్సయ్య పాల్గొన్నారు.

మామిడి తోటల్లో విందులు..
రైతుల ఇబ్బందులు

- సీసాలు పగులగొడుతున్న మందుబాబులు
- శృతి మించుతున్న ఆగడాలు
- పోలీసులు చర్యలు తీసుకోవాలంటున్న రైతులు



జాబితాపూర్ శివారులోని మామిడితోటలో ప్లాస్టిక్ వస్తువులు

జగిత్యాలఅగ్రికల్చర్: ఓ వైపు మామిడి రైతులు మామిడితోటలకు పూత సరిగ్గా రాలేదని ఇబ్బందులు పడుతుంటే, ఆ తోటలు మందుబాబులకు అడ్డాలుగా మారాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో మామిడి తోటలు మద్యం ప్రియులతో నిండిపోతున్నాయి. దీంతో, చుట్టు పక్క పొలాలు, తోటల మహిళా రైతులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. ఉదాహరణకు.. జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ శివారులో ప్రతి రోజు మందుబాబులు మామిడి తోటల్లోకి రాకుండా, మామిడి తోటల యజమానులు కాపాలాగా వె వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మందు ఎక్కువగా సేవించిన తర్వాత ఇష్టం వచ్చినట్లు సీసాలు పగులగొట్టడం చేస్తుండటంతో, రైతుల కాళ్లకు పగిలిన సీసాలు కుచ్చుకుని ఆస్పత్రుల పాలవుతున్నారు. తోటలు దున్నినప్పుడు ట్రాక్టర్లు పంక్చర్లు అవుతున్నాయి. మద్యం ప్రియులు విచ్చలవిడిగా మందు పార్టీలు చేసుకుని తోటల్లో మాంసపు వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులను తోటలోనే వదిలివెళ్లుతున్నారు. చికెన్, మటన్ బొక్కలు తినేందుకు మామిడితోటల్లోకి కుక్కలు వస్తున్నాయి. కుక్కలు ఎప్పుడు తోటల్లోనే ఉండి యజమానులపైకే మొరుగుతూ దాడి చేస్తున్నాయి. ఇది చాలదన్నంటూ కుక్కలు బొక్కలు తిని, నీటి కోసం మామిడి తోటల్లో ఉండే డ్రిప్ పైపులను ఇష్టం వచ్చినట్లు కొరికి వేస్తున్నాయి. జిల్లాలో వైన్స్‌ల దగ్గర ఉన్న మామిడి తోటలైతే భూమికి బదులు ప్లాస్టిక్ గ్లాస్‌లతో పరుచుకుని ఉంటున్నాయి.

మందు బాబుల ఆగడాలపై ఫిర్యాదు

విచ్చలవిడిగా ప్లాస్టిక్ పడేయడంతో సాగు భూమికి సైతం నష్టం వాటిల్లి, మున్ముందు పంటలు పండే పరిస్థితి లేకుండా పోయింది. మందుబాబుల ఆగడాలు భరించలేక జిల్లాలోని కొందరు రైతులు తోటలను నరికేందుకు సిద్ధమవుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. మందు బాబుల ఆగడాలపై తోటల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. జిల్లాలోని మామిడి తోటలు రైతులు త్వరలో జిల్లా ఎస్పీని కూడా కలవాలని యోచిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని మద్యం ప్రియులపై చర్యలు తీసుకోవాలని మామిడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.



మామిడితోటల్లో పగులగొట్టిన సీసాలు, కవర్లు

తాగి పగులగొడుతున్నారు



మామిడితోటల్లో మద్యం సేవించడమే కాకుండా సీసాలు పగులగొడుతూ నానా హంగామా చేస్తున్నారు. సీసాలను పక్కనున్న పొలాల్లోకి విసిరి వేయడంతో, ట్రాక్టర్లు దున్నినప్పుడు టైర్లకు కుచ్చుకపోయి పంక్చర్లు అవుతున్నాయి. పొలాల్లో దిగి పనిచేసే వారికి కుచ్చుకుంటున్నాయి.

– గడ్డం సత్యనారాయణ రెడ్డి, నాగారం, ధర్మపురి(మం)

ప్లాస్టిక్‌తో నింపేస్తున్నారు



మామిడితోటల్లోకి ప్లాస్టిక్ వస్తువులను తీసుకువచ్చి అక్కడే వదిలేస్తున్నారు. దీంతో, తోటంతా ప్లాస్టిక్‌తో నిండిపోతుంది. ప్లాస్టిక్ గ్లాస్‌లు, కవర్లను ఏరిపించేందుకు వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. కూలీలు కూడా ఇబ్బంది పడుతున్నారు. బహిరంగంగా మద్యం సేవించడంపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– సత్యనారాయణ రెడ్డి, సారంగాపూర్

మాత్రల పంపిణీ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వినోద్

కథలాపూర్: ఈనెల 10న నిర్వహించే నులి పురుగుల నివారణ దినోత్సవంలో అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని తహసీల్దార్ వినోద్ కోరారు. శుక్రవారం కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో మండల టాస్క్‌ఫోర్స్ అధికారుల సమావేశం జరిగింది. ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు లోపు ఉన్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్, వైద్యాధికారులు సింధూజ, అర్చన, సూపర్‌వైజర్ శ్రీధర్, ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశం పాల్గొన్నారు.

పెగడపల్లి: ఈ నెల 10న నిర్వహించే నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు పేర్కొన్నారు. నులి పురుగుల నివారణ దినోత్సవ నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం టాస్క్ ఫోర్స్ సభ్యుల సమావేశం జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో 1 నుంచి 10 ఏళ్లలోపు ఉన్న వారందరిని గుర్తించి మాత్రలు పంపిణీ జరిగేలా ఏర్పాటు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నరేశ్, ఎంఈవో సులోచన, జయశీల, సూపర్‌వైజర్స్ మహేశ్వరి, సుభద్ర, డీటీ లాస్యశ్రీ, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మెట్‌పల్లి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి అన్నారు.మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు.మెట్‌పల్లి పట్టణంతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రలు వేసేందుకు ఏఎన్ఎంలు,ఆశ,అంగన్వాడీ కార్యకర్తలు,వైద్య సిబ్బంది వస్తారని సహకరించాలని కోరారు.

విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జ్ఞాపిక, సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

మల్లాపూర్: మల్లాపూర్ మోడల్ స్కూల్‌కి చెందిన 90 మంది విద్యార్థినులు ఈ నెల 2న మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించిన ద్విశత(200) పేరిణి నృత్యోత్సవంలో పాల్గొని 'తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించారు.ఈ సందర్భంగా శుక్రవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూమేశ్వర, మెట్‌పల్లి మీనాక్షి కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీవాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు

రాయికల్: పట్టణంలోని ప్రణతి జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివప్రసాద్,ప్రిన్సిపాల్ తిరుపతి,ఏఐఎస్ఎఫ్‌నాయకులు పాల్గొన్నారు.

షీప్‌పాక్స్ టీకాలు తప్పనిసరిగా వేయించాలి



గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి మనీషా

మెట్‌పల్లిరూరల్: మూడు నెలల వయస్సు దాటిన జీవాలకు షీప్‌పాక్స్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మెట్‌పల్లి మండల పశు వైద్యాధికారి కొమ్మెర మనీషా అన్నారు. మండలంలోని వెల్లులలో గొర్రెలకు షీప్‌పాక్స్(పోచమ్మ వ్యాధి) నివారణ టీకాలను శుక్రవారం వేశారు. ఈ సందర్భంగా రైతులకు ఆమె పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రమణయ్య,యాదవులు,తదితరులు పాల్గొన్నారు.

జంతువుల సంక్షేమంపై వ్యాసరచన పోటీలు.

కథలాపూర్: పశుసంవర్ధకశాఖ పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని దుంపేట, కథలాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో జంతు సంక్షేమంపై పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి దివ్యశ్రీ, ఉపాధ్యాయులు సతీశ్, రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో శుక్రవారం ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. సదరు మహిళ పలు సమస్యలతో ఇంట్లో ఉరే వేసుకుంటున్న విషయాన్ని గ్రామస్తులు గమనించి 100కు డయల్ చేశారు. దీంతో హెడ్ కానిస్టేబుల్ అహ్మద్, కానిస్టేబుల్ రవి వెంటనే గ్రామానికి వెళ్లి ఆమె ఇంటి తలుపులు పగులగొట్టి ప్రాణాలు కాపాడారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

డీసీఎమ్మెస్ భవనం లీజ్‌పై ఫిర్యాదు

మెట్‌పల్లి: సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎమ్మెస్)కు చెందిన స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న భవనం నిబంధనలు పాటించుకుండా లీజ్‌కు ఇవ్వడం సరికాదని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని సొసైటీ స్థలంలో ఉన్న పాత షెడ్డును తొలగించి అందులో భారీ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే టెండర్లు నిర్వహించకుండానే ఓ వ్యక్తికి భవనం లీజుకు ఇవ్వడంపై జిల్లా డీసీఎమ్మెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఫిర్యాదు చేశారు. సొసైటీ అధికారులు, పాలకవర్గ సభ్యులు సదరు వ్యక్తితో లోపాయికారి ఒప్పందం చేసుకొని తక్కువ ధరకు కేటాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి తక్కువ ధరకు కేటాయించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

యూరియా గోదాంలో ఏవో తనిఖీ



సీఈవోకు నోటీసు ఇస్తున్న ఏవో యోగిత

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ సొసైటీ యూరియా గోదాంను ఏవో యోగితా శుక్రవారం తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న యూరియా సంచులను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డులకు, యూరియా బస్తాల నిల్వలకు పొంతన లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనుంచి యూరియా విక్రయాలు ఆపేయాలని ఏవో యోగితా సీఈవోకు నోటీసులు ఇచ్చారు. 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థికి అభినందన

జగిత్యాల: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించింది. మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట ఏఎస్ఆర్ తండాకు చెందిన గుగ్లావత్ భీమ్‌నాయక్ కుమార్తె రాజమణి ఇటీవల జరిగిన తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రిక్రూట్‌మెంట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ కళాశాల అధ్యాపకులు ప్రమోద్‌కుమార్, చంద్రయ్య తదితరులు ఆమెను అభినందించారు.

నేటి నుంచి రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



సంగెం శ్రీ సీతారామస్వామి ఆలయం

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం శివారు రామస్వామి గుట్టపై ఉన్న శ్రీ సీతారామ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం అవుతాయని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. మొదటి రోజు శనివారం అంకురారోపణ, అఖండ దీపారాధన,రక్షాబంధనం, ధ్వజారోహణం , ఆదివారం సీతారాముల కళ్యాణం నిర్వహిస్తారు.సోమవారం, మంగళవారాలు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. మాఘపూర్ణిమ బుధవారం రోజు స్వామి వారి జాతర, రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.



కథలాపూర్: కోరుట్ల- వేములవాడ రహదారిలో కథలాపూర్ మండలం సిరికొండ గ్రామశివారులో తారురోడ్డుపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ గుంత వద్ద బైక్‌పై వెళ్లేవారు గమనించకుండా పోతే ప్రమాదాలకు గురవుతున్నారని పలువురు వాపోతున్నారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలను తారు పోసి పూడ్చివేయించాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీకాంత్,ఆర్అండ్‌బీ,ఏఈ కథలాపూర్ క్లస్టర్,
సెల్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రమాబాయికి నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని కోరుట్ల పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రమాబాయి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ రాష్ట్ర నాయకులు బలిజ రాజరెడ్డి, ఉయ్యాల నర్సయ్య, గోరుమంతుల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి పండిత రమాబాయి జయంతి వేడుకలను దళిత సంఘాల నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్లాక్ చౌరస్తాలో రమాబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో మల్యాల ఈశ్వర్, నలువాల సంజీవ్, మునుగూరి శంకర్, దొనకొండ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు తరలించనున్న పశువులు

ధర్మపురి: రోడ్లపై తిరుగుతూ పట్టణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న పశువులను గోశాలకు తరలించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. దీని కోసం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాస్ తాత్కాలిక బంజరుదొడ్డిని ఏర్పాటుచేసి అందులోకి పశువులను పంపించారు. పశువులకు తాగు నీటి వసతులు, కూరగాయలు తదితర వాటిని సమకూర్చారు. పశువులను రోడ్లపై విడిచిపెట్టే యజమానులకు జరిమానా విధిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. యజమానులువారి పశువులను మందకు తరలించాలని, రోడ్లపై వదిలేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రాయికల్: పట్టణంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎనలగందుల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, కోశాధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

మెట్‌పల్లి: బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మెట్‌పల్లి పట్టణానికి చెందిన యాదగిరిబాబును ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌కుమార్ శుక్రవారం కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీనివాస్, సదాశివ్, రమేశ్, మహేశ్, అశోక్,నాగరాజు, రాజేందర్, రణధీర్,తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లు ఐక్యంగా ఉండాలి

రాయికల్: మండలంలోని పాస్టర్లు ఐక్యంగా ఉండాలని సంఘ జిల్లా అధ్యక్షుడు లాజరస్ అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలో పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రైస్తవులంతా పాస్టర్లతో కలిసి ఐక్యతతో ఉండాలని తెలిపారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూలూరి ప్రసాద్, పాస్టర్లు రవి, తిమోతి, మనోక్, బర్నాబస్, ఎజ్రా, డేవిడ్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ధర్మపురి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ధర్మపురికి చెందిన కొడపర్తి సతీశ్‌కు సారంగాపూర్ మండలంలోని కొల్వాయికి చెందిన లావణ్యతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు పిల్లలు, లావణ్య ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వీపర్‌గా పని చేస్తోంది. ఈనెల 6న రోజు లాగే గుడిలో పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. రాత్రి అయినప్పటికీ లావణ్య ఇంటికి రాలేదు. శుక్రవారం లావణ్య భర్త సతీష ధర్మపురి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి, చల్‌గల్ గ్రామ శివారులో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న స్థావరంపై జగిత్యాల సీసీఎస్ పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.35 వేల నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస, పొరండ్ల సబ్‌స్టేషన్లలో పొరండ్ల, పొలాస, గుల్లపేట, అగ్రికల్చర్ కాలేజ్, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, కన్నాపూర్, బాలపల్లి, కండ్లపల్లి, హన్మాజీపేట గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ సుందర్ తెలిపారు.

జగిత్యాల జిల్లా కేంద్రంలోని రాంబజార్, పురాణిపేట, ఎల్జీరామ్‌లాడ్జ్ ఏరియా, అంగడిబజార్, యావర్‌రోడ్, మార్కెట్‌బ్యాక్‌సైడ్, కృష్ణానగర్, అరవింద్‌నగర్, మార్కండేయ టెంపుల్ ఏరియా, టాకాసంది, సాయిరాంనగర్, కరీంనగర్‌రోడ్, గోవిందుపల్లి, గణేశ్ టెంపుల్ ఏరియా, బైపాస్‌రోడ్, శ్రీరాంనగర్, వెంకటాద్రినగర్‌లలో శనివారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ రాజిరెడ్డి తెలిపారు.

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట, సంగెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ భూక్య శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గం॥ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డి తెలిపారు.

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని ఆదర్శనగర్, అర్బన్‌కాలనీ, బిలాల్‌పూర, రాంనగర్‌లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ 2 ఏఈ తెలిపారు.

మల్యాల: మండలంలోని మల్యాల,తక్కళ్లపల్లి, సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనుందని విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు.